సాక్షి
ఖమ్మం
బుధవారం । 4 । డిసెంబర్ । 2024



రైతులకు కష్టం రానివ్వం..

రైతులకు ఏ కష్టం రాకుండా తమ ప్రభుత్వం పథకాలు అమలుచేస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 8లో



నేడు 'సాధన సర్వే' పరీక్ష

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల్లో సామర్థ్యాలు పరీక్షించేందుకు జాతీయ సాధన సర్వే పేరిట నేడు పరీక్ష నిర్వహించనున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. మళ్లీ సాయంత్రం తర్వాత చలిగాలులు పెరుగుతాయి.

చెప్పిన ప్రతీ పని చేస్తాం..

- సీతారామ ప్రాజెక్టు పూర్తితో భద్రాద్రి జిల్లాలో కొత్త ఆయకట్టు
- గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టును స్థిరీకరిస్తాం
- వచ్చే నాలుగేళ్లలో అన్నిరంగాల్లో అగ్రభాగాన ఉమ్మడి జిల్లా
- పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తా

ఏడాది పాలనపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నాం. రైతును రాజుగా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృఢసంకల్పంతో ఉన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. రైతులకు రుణమాఫీ చేయగా, సంక్రాంతి తర్వాత రైతుభరోసా అందనుంది. త్వరలోనే ఏదులాపురం కేంద్రంగా కొత్త మున్సిపాలిటీ ఏర్పాటవుతుంది' అని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈనెల 7వ తేదీతో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇప్పటి వరకు అమలుచేసిన హామీలతో పాటు భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఆ వివరాలు మంత్రి మాటల్లోనే..

సీతారామ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి..

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. భవిష్యత్‌లో సాగర్ జలాలు రాకున్నా గోదావరి జలాలతో ఈ ప్రాజెక్టు నింపొచ్చు. 2.50 లక్షల ఎకరాలకు పైగా సాగర్ ఆయకట్టులో కృష్ణా, గోదావరి జలాలతో రెండు పంటలు పండుతాయి. పాలేరు లింక్ కెనాల్ పనులు కూడా త్వరగానే పూర్తవుతాయి. ఈ ప్రాజెక్టుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతనంగా ఆయకట్టు ఏర్పడుతుంది. ఇటు సాగర్, ఆటు సీతారామతో ఉమ్మడి జిల్లా పంటల హబ్‌గా మారనుంది.

ఇది మా రికార్డు..

కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే బలం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ అమలు చేశాం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు విడతలుగా 1,97,384 మంది రైతులకు రూ.1,392 కోట్ల మేర రుణాలు మాఫీ అయ్యాయి. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా రుణమాఫీ రూ.2 లక్షల వరకు చేయలేదు. ఇది మా ప్రభుత్వ రికార్డు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ధాన్యానికి రూ.250 బోనస్ ఇవ్వగా, ఇప్పుడు రూ.500 ఇస్తున్నాం. ఎన్నికల హామీ మేరకు సంక్రాంతి తర్వాత రైతు భరోసా అమలుచేస్తాం.

మున్నేటి కన్నీరు తీరుస్తాం...

ఈ ఏడాది సెప్టెంబర్‌లో మున్నేటికి మునుపెన్నడూ లేని రీతిలో వరద వస్తే ప్రజలను రక్షించేందుకు అన్ని చర్యలు చేపట్టాం. నష్టపోయిన ప్రతీ కుటుంబానికి రూ.16,500 చొప్పున అందించాం. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాం. సర్టిఫికెట్లు నష్టపోయిన వారికి కొత్తవి జారీ చేయిస్తున్నాం. భవిష్యత్‌లో మున్నేటి పరీవాహక ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రక్షణగోడ నిర్మాణం జరుగుతోంది.

వేగంగా అభివృద్ధి

పాలేరు నియోజకవర్గంలో ఎస్సారెస్పీ కాల్వల కోసం భూములు ఇచ్చిన కూసుమంచి మండల రైతులకు రూ.1.70 కోట్లు పరిహారం చెల్లించాం. తద్వారా 5వేల ఎకరాలకు నీరు అందించాం. నియోజకవర్గంలో తల్లంపాడు–రాజేశ్వరపురం, పల్లెగూడెం–మంగళగూడెం, పాన్నెకల్ క్రాస్ రోడ్డు నుంచి పిట్టలవారిగూడెం వరకు ఆర్‌అండ్‌ రహదారి పనులకు శంకుస్థాపన చేశాం. పాన్నెకల్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరగనుంది. నేలకొండపల్లిలో రూ.10 కోట్లతో మోడల్ డిగ్రీ కళాశాలను ప్రారంభించాం. నేలకొండపల్లిలో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. రూ.3కోట్లతో బీరోలు చెరువు సుందరీకరణ చేపట్టాం. తిరుమలాయపాలెంలో ఎంసీహెచ్ ఏర్పాటుకు రూ.26కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ఈ మండలంలో రూ.5 కోట్లతో గిరిజన బాలుర వసతిగృహాన్ని నిర్మిస్తున్నాం.

నాలుగేళ్లలో మరింతగా..

మంత్రి వచ్చే నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాతో పాటు పాలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్‌గా తీర్చిదిద్దుతా. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం. పాలేరు నియోజకవర్గంలో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా.. నర్సింగ్ కళాశాలనూ ఏర్పాటు చేశాం. 43 గ్రామపంచాతీల భవన నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు మంజూరు కావడంతో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఏదులాపురం కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్న నేపథ్యాన త్వరలోనే మంజూరు కానుంది.

పాలేరుకు కొత్తరూపు..

ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో నన్ను గెలిపించిన పాలేరు ప్రజల రుణం తీర్చుకుంటా. ఎన్ఆర్‌ఈజీఎస్ కింద 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాలకు రూ.57.15 కోట్లు మంజూరయ్యాయి. రూ.5 కోట్లతో పాలేరు లేక్ నిర్మాణం చేపట్టాం. రూ.12 కోట్లతో ఎన్నెస్పీ కాల్వకు మరమ్మతులు చేయించాం. సీఆర్ఆర్ గ్రాంట్ కింద 11 అభివృద్ధి పనులకు రూ.25 కోట్లు మంజూరు చేశాం. కూసుమంచిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించి నిర్వహణకు రూ.5.5 కోట్లు కేటాయించాం. అలాగే ట్రామా కేర్ సెంటర్‌కు రూ.26 కోట్లు మంజూరయ్యాయి.

తగ్గేదే లేదు..

హామీల అమలులో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500కు సబ్సిడీ గ్యాస్ అందిస్తున్నాం. అలాగే రేషన్ లబ్ధిదారులతోపాటు హాస్టళ్లు, పాఠశాలల్లో సన్న బియ్యం ఇచ్చేలా సన్నాహాలు చేస్తున్నాం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తాం. జాతీయ రహదారులతోపాటు ఆర్‌అండ్‌బీ రహదారులు కొత్తవి నిర్మించడంతోపాటు అవసరమైన చోట్ల మరమ్మతులు జరుగుతున్నాయి. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా నేలకొండపల్లిలో బౌద్ధస్తూపం అభివృద్ధికి రూ.2.50 కోట్లను ప్రభుత్వం కేటాయించింది.

ఇంకా చేయాల్సినవి

- పాలేరు రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- గ్రామాల నుంచి మండలానికి రహదారులను డబుల్ లేన్‌గా మారుస్తాం
- ప్రతీ గ్రామపంచాయతీకి నూతన భవనాలను నిర్మిస్తాం
- పాలేరు నియోజకవర్గంలో పీహెచ్‌సీల స్థాయి పెంచి వసతులు కల్పిస్తాం
- చివరి ఆయకట్టుకు నీరు అందేలా పంట కాల్వల్లో సిల్ట్ తీయిస్తాం.

భారీ వర్షాలతో అపారనష్టం

- వరదతో జిల్లా అతలాకుతలమైంది..
- కేంద్ర బృందానికి వివరించిన కలెక్టర్
- వరద ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు



రాకాసితండా వాసులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యుడు అమిత్

ఖమ్మం సహకారనగర్: గత సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో భారీగా నష్టం జరిగిందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం కలెక్టరేట్‌లో సమావేశమైంది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా 229 గ్రామాలు, 42 పట్టణ ప్రాంతాల్లో 53,430 మంది ప్రభావితమయ్యారని, ఆరుగురు ప్రాణాలు కోల్పోగా వారి కుటుంబీకులకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించామన్నారు. అలాగే, 15,258 ఇళ్లు దెబ్బతిన్నాయని, 16,500మందికి నష్టపరిహారం చెల్లించామని తెలిపారు. మిగతా ప్రజలు, ప్రభుత్వ ఆస్తులకు రూ.672.78 కోట్ల మేర నష్టం జరిగిందని కలెక్టర్ చెప్పారు. అనంతరం సీబీఆర్ఐ డైరెక్టర్ ఆర్.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ 17మంది సభ్యులతో కూడిన బృందం పీడీఎన్ఏ(పోస్ట్ డిజాస్టర్ నీడ్స్ అసెస్‌మెంట్)లో భాగంగా నష్టం వివరాలు అంచనా, పూర్వ పరిస్థితికి తీసుకొచ్చేందుకు ఎంత వ్యయమవుతుందో అంచనా వేసేందుకు వచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన అంశాల ఆధారంగా సాయం కోసం నివేదిక రూపొందిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్వో రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- ఖమ్మంమయూరిసెంటర్: మున్నేటి వరదతో దెబ్బతిన్న ఖమ్మం దానవాయిగూడెం వద్ద ఇన్ టేక్ వెల్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కేంద్ర బృందం పరిశీలించింది. అధికారులు వారికి నష్టాన్ని వివరించగా, రాజీవ్‌గృహ కల్పలోనూ పర్యటించారు. కేఎంసీ ఎస్ఈ, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, కేఎంసీ ఈఈ కృష్ణాలాల్ తదితరులు పాల్గొన్నారు.
- ఖమ్మంరూరల్: అకాల వరదలతో నష్టపోయిన ప్రాంతాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని రాజీవ్‌గృహకల్ప, నాయుడుపేట, జలగం నగర్‌లో పర్యటించి ఇళ్లు, రహదారులకు జరిగిన నష్టంపై ఆరా తీశారు. ఎంపీడీఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో వరదలతో భారీ నష్టం జరగగా, మూడు బృందాలుగా విడిపోయిన అధికారులు పాలేరు రిజర్వాయర్, మత్స్య పరిశోధనా కేంద్రం, భక్తరామదాసు ప్రాజెక్టు, ఎడమ కాల్వను పరిశీలించారు. వీరికి జలవనరుల శాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డీఏఓ పుల్లయ్య, మత్స్యశాఖ ఏడీ శివ ప్రసాద్, పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ వివరాలను అందించారు. అలాగే, మత్స్యకారులు, రైతులు కలిసి తమకు ఎదురైన నష్టాన్ని వివరించారు. అధికారులు సీ.పీ.మోహన్, శివజ్యోతి నారాయణ,షేక్ ఇమామ్, విజయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావుతో పాటు ఏడీఏ సరిత, ఏఓ వాణి, డీఈఈ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.
- తిరుమలాయపాలెం: మండలంలోని అజ్మీరాతండా జీపీ పరిధి రాకాసితండాలో కేంద్ర బృందానికి చెందిన అమిత్, డీపీఓ ఆశాలత తదితరులు పర్యటించారు. ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జి దెబ్బతిన్న ప్రాంతం, జరుగుతున్న మరమ్మతులను పరిశీలించగా తండావాసులు తమకు జరిగిన నష్టాన్ని వివరించి ఆదుకోవాలని కోరారు. ఎంపీఓ సూర్యనారాయణ, విద్యుత్ ఎస్ఈ సురేందర్, ఏఈ భాస్కర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగులకు శుభవార్త

- లాభాల్లో నుంచి ప్రోత్సాహకంగా 45 రోజుల వేతనం
- బ్యాంకు పాలకవర్గ సమావేశంలో నిర్ణయం
- మొండి బకాయిలు, నకిలీ బంగారంపైనా చర్చ



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పాలకవర్గం ఉద్యోగులకు శుభవార్త అందించింది. బ్యాంకు లాభాల్లో 45 రోజుల వేతనాన్ని ప్రోత్సాహకంగా అందించాలని నిర్ణయించింది. అంతేకాక ఉద్యోగి ఎవరైనా మరణిస్తే అందించే దహన సంస్కారాల ఖర్చులను రూ.10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. డీసీసీబీ పాలకవర్గ సమావేశం మంగళవారం చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఖమ్మంలోని ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా గత ఏడాది బ్యాంకు రూ. 3.49 కోట్ల లాభాలను సాధించగా, ఏటా ఉద్యోగులకు ప్రోత్సాహకాలు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి 100 రోజుల ప్రోత్సాహం ఇవ్వాలని ఉద్యోగులు కోరుతుండగా చర్చించిన పాలకవర్గం గత ఏడాదిలాగే ఈసారి కూడా 45 రోజుల వేతనాన్నే అందించాలని నిర్ణయించింది. దీంతో లాభంలో సుమారు రూ.2 కోట్లకు పైగా నగదును దాదాపు 450 మంది ఉద్యోగులకు చెల్లించనున్నారు.

బకాయిలు, రుణాలపై సమీక్ష

కొంత కాలంగా పేరుకుపోయిన మొండి బకాయిలతో పాటు ఇటీవల నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న వారి విషయమై పాలకవర్గం చర్చించింది. ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా వసూలు చేస్తే ఫలితముంటుందని పలువురు డైరెక్టర్లు అభిప్రాయపడ్డారు. అలాగే, నకిలీ బంగారం తాకట్టు పెట్టిన వారికి రుణాలు ఎలా ఇచ్చారని అధికారులను ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో బ్యాంకు సీఈఓ వెంకటఆదిత్య, జనరల్ మేనేజర్ వసంత రావుతో పాటు డీజీఎంలు, ఏజీఎంలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

'పాలేరు' ఇంజనీరింగ్ కాలేజీకి సొంత భవనాలు

రూ.108 కోట్ల నిధుల మంజూరు



ఖమ్మంరూరల్: పాలేరు నియోజకవర్గంలో జేఎన్‌టీయూ ఆధ్వర్యాన ఏర్పాటైన ఇంజనీరింగ్ కళాశాలకు సొంత భవనాలు సమకూరనున్నాయి. ఈమేరకు ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపాదనల మేరకు ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో భవన నిర్మాణాలకు రూ.108.60 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాదే కళాశాల మంజూరు కాగా ప్రస్తుతం అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యాన సొంత భవనాలకు నిధులు మంజూరు చేయించడంపై విద్యార్థులు, పాలేరు నియోజకవర్గ ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



దివ్యాంగులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంవన్‌టౌన్: పట్టుదలతో ముందుకు సాగుతూ దివ్యాంగులు సాధారణ వ్యక్తులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ కష్టం వచ్చినా కలెక్టర్‌గా కాకుండా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. అర్హత మేరకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని చెప్పారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి కీసర రాంగోపాల్‌రెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏసీబీ పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: అవినీతి నిరోధక శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం నంబర్లు 91543 88989, 040–23251555, లేదావాట్సాప్ 94404 46106 నంబర్‌తో పాటు ఖమ్మం రేంజ్ అధికారులను 91543 88981, 0874–2228663 నంబర్ల ద్వారా సంప్రదించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ వై.రమేష్, ఇన్‌స్పెక్టర్ ఎన్.శేఖర్ పాల్గొన్నారు.

హోంగార్డులకు ఆటలపోటీలు

ఖమ్మంక్రైం: ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులకు మంగళవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈనెల 6న హోంగార్డ్స్ రైజింగ్ డే జరగనుండగా ఈ పోటీలను ఏఆర్ పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటుచేశారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీ సుశీల్ సింగ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు పోటీల్లో హోంగార్డులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో విజేతలకు 6వతేదీన బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ ఆర్ఐ సురేష్, ఆర్ఎస్సై లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ సర్వీస్ చేస్తున్న అధికారి



టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న మహిళా హోంగార్డులు

ఫుడ్‌పార్క్ ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలం బుగ్గపాడులోని మెగా ఫుడ్‌పార్కు ప్రారంభోత్సవం, బహిరంగ సభ ఈనెల 5న జరగనుండగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. ఫుడ్‌పార్కును మంగళవారం పరిశీలించిన అధికారులతో సమీక్షించారు. మధ్యాహ్నం 2గంటలకు మొదలయ్యే సభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారని, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తుల అవగాహన సదస్సుకు 10వేల మంది హాజరవుతారని తెలిపారు. ఈమేరకు టెంట్లు, తాగునీరు, ఫ్యాన్లు ఏర్పాటుచేయాలన్నారు. టీజీఐఐసీ సీఈ వినోద్‌కుమార్, డీఈఈ డి.స్మరత్‌చంద్ర, జోనల్ మేనేజర్ పి.మహేశ్వర్‌రావు, కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంఈఓ రాజేశ్వరరావు, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓ శ్రీనివాసరావు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



డోజర్లతో మైదానాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

చకచకా పనులు

బుగ్గపాడులోని 203 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన మెగాఫుడ్ పార్క్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలించి సూచనలు చేయగా పనులు మొదలుపెట్టారు. జిల్లా పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ పి.మహేశ్వర్ పర్యవేక్షణలో మైదానంలోని ముళ్లకంపలను డోజర్లు, జేసీబీలతో తొలగిస్తున్నారు. అలాగే, డివైడర్లపై పెరిగిన పిచ్చిమొక్కలు, రహదారిపై ఉన్న చెత్తను కార్మికులతో తీయించారు. రహదారి పొడవున డివైడర్లకు రంగులు వేయడమే కాక స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పామాయిల్ ఫ్యాక్టరీ పనులు ప్రారంభించండి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



గోద్రెజ్ కంపెనీ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: కొణిజర్ల మండలం అంజనాపురంలో పామాయిల్ ఫ్యాక్టరీ పనులను వెంటనే చేపట్టాలని గోద్రెజ్ ఆయిల్‌ఫెడ్ అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన గోద్రెజ్ కంపెనీ అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు పెరుగుతున్న నేపథ్యాన ప్రైవేట్ పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అనంతరం పరిశ్రమ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించి సూచనలు చేశారు. గోద్రెజ్ కంపెనీ అధికారి సొగత్ ఆయోగ్ తదితరులతో పాటు చావా వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, తాతా రఘునాథ్, దుర్గాప్రసాద్, రావూరి సైదుబాబు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే కుష్టు నిర్మూలన



సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి

ఖమ్మంఅర్బన్: ప్రజలు ధైర్యంగా పరీక్షలు చేయించుకుంటే కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని, ఇందుకోసం గ్రామాలకు వస్తున్న సిబ్బందికి సహకరించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కళావతిబాయి కోరారు. ఖమ్మం ఖానాపురంలో కొనసాగుతున్న ఎల్‌సీడీసీ సర్వేను మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. సిబ్బంది ఇంటింటికీ వచ్చి స్పర్శ లేని మొద్దు బారిన మచ్చలు ఉన్న వారిని చికిత్స కోసం ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం పల్లె దవాఖానా డాక్టర్ శ్రేయ, ఉద్యోగులు బోజ్యా, కృష్ణ, గోలి రమాదేవి, శ్రీనివాస్, తాళ్లూరి శ్రీకాంత్, చావా రజని, ప్రమీలరాణి, ఉమ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

5నుంచి డీఈఈసెట్ అభ్యర్థులకు కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు(డీఈఈసెట్)లో అర్హత సాధించిన విద్యార్థులకు డైట్‌లో ప్రవేశాలు కల్పించేలా రెండో విడత కౌన్సెలింగ్ ఈనెల 5నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు 5నుంచి జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైతే 7నుంచి 9వ తేదీ వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వెల్లడించారు. అలాగే, 13వ తేదీన సీటు కేటాయించనుండగా, ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి ఈనెల 13నుంచి 17వ తేదీ వరకు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, కన్వర్షన్ ఆధారిత సీటు కేటాయింపు ఈనెల 18న జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు deecet. cdse. telangana. gov. in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

ప్రకాష్‌నగర్ వంతెన మరమ్మతులు ప్రారంభం



పిల్లర్ల వద్ద పనులు చేస్తున్న కార్మికులు

ఖమ్మంఅర్బన్: మూడు నెలల కిందట మున్నేటికి వచ్చిన భారీ వరదతో ఖమ్మం ప్రకాష్‌నగర్ వద్ద వంతెన దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ మేరకు వంతెనపై రాకపోకలు నిలిపివేయగా.. మంగళవారం నుంచి మరమ్మతులు ప్రారంభించారు. మునుపెన్నడూ లేని రీతిలో వచ్చిన వరదతో బ్రిడ్జి పిల్లర్ల వద్ద శ్లాబ్ పక్కకు జరిగింది. దీంతో హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులు, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ల పర్యవేక్షణలో మరమ్మతులు చేపడుతున్నారు.

క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో డీడీ విచారణ



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలలో విద్యార్థినులకు సరైన సౌకర్యాలు అందడం లేదని, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఈనెల 2న పేరెంట్స్ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం సోషల్ వేల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ పాఠశాలలో విచారణ చేపట్టారు. పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థినులకు మూడు నెలలుగా చికెన్, మటన్ అందజేయడం లేదని, కోడిగుడ్లు కూడా నాసిరకంగా ఉంటున్నాయని, భోజనంలోనూ నాణ్యత ఉండడం లేదని తెలిపారు. ఇటీవల ఎనిమిదో తరగతి విద్యార్థినికి అకారణంగా టీసీఇచ్చి పంపించారని ఫిర్యాదు చేశారు. అనంతరం విద్యార్థులతో కూడా మాట్లాడి డీడీ నివేదికను కలెక్టర్ ఇస్తామని తెలిపారు.

104 వాహనాల వేలం పూర్తి

ఖమ్మంవైద్యవిభాగం: ఏళ్లుగా వానకు తడిసి, ఎండకు ఎండి తుప్పుపట్టిన 104 వాహనాల వేలం ఎట్టకేలకు పూర్తయింది. గత ప్రభుత్వం 104 సేవలను రద్దు చేయడంతో రెండేళ్లుగా జిల్లాలో 11వాహనాలను ఖమ్మం పెద్దాస్పత్రి ఆవరణలో మూలన పెట్టారు. గతంలో రెండు సార్లు వేలం వేసినా ఎవరూ ముందుకు రాకపోవడంతో మరోమారు వేలం వేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. దీంతో మంగళవారం డీఎంహెచ్ఓ కళావతిబాయి ఆధ్వర్యాన వేలం నిర్వహించగా స్వరాజ్ మజ్దా కంపెనీ 2008 మోడల్‌కు చెందిన 11వాహనాలను గుంటూరుకు చెందిన ఎస్.కే.జిలానీ రూ.11.09లక్షలకు దక్కించుకున్నాడు. విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, మహబూబాబాద్ ప్రాంతాల నుండి 68మంది హాజరైనా ఎక్కువ ధర పాడిన జిలానీ పేరు ఖరారు చేశారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు రైతు ఫిర్యాదు

కొణిజర్ల: ఓ కంపెనీ మొక్కజొన్న విత్తనాలు నాటగా, అవి మొలకెత్తకపోవడంతో మళ్లీ నాటాలని చెబితే అంగీకరించనందుకు తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని మండలంలోని తుమ్మలపల్లికి చెందిన కుంచపు సీతారాములు కోరారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన కలెక్టర్, తహసీల్దార్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తుమ్మలపల్లికి చెందిన రైతు సీతారాములు ఓ కంపెనీకి చెందిన ఆడామగ రకం మొక్కజొన్న విత్తనాలు నాటగా మగరకం విత్తనాలు మొలకెత్తలేదు. కంపెనీ ప్రతినిధులకు పరిశీలించి మళ్లీ విత్తనాలు నాటాలని చెబితే రైతు ఒప్పుకోలేదు. దీంతో ఒప్పందాన్ని ఉల్లంఘించానని తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యాన విచారణ జరిపించాలని ఆయన కోరాడు.

కిడ్నీ బాధితుడిని ఆదుకోవాలని వినతి



ములుగుమాటి సత్యం

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్లకు చెందిన ములుగుమాటి సత్యం ఇరవై ఏళ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తుండగా ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధి బారిన పడ్డాడు. అయితే, నిరుపేద కుటుంబం కావడంతో సరైన చికిత్స అందక వ్యాధి మరింత ముదిరింది. ఆటో నడపనిదే పూట గడవని స్థితిలో ఆయన చికిత్స చేయించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈమేరకు దాతలు ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. దాతలు 86889 02490 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా సాయం జమ చేయాలని సత్యం, ఆయన కుటుంబీకులు వేడుకుంటున్నారు.

పత్తి నిండటంతో కొనుగోళ్లు నిలిపివేత

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీలక్ష్మిప్రియా కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో నిర్వహిస్తున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో పత్తి పేరుకుపోయింది. దీంతో జిన్నింగ్ ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఇల్లెందు మార్కెట్ చైర్మన్ రాంబాబు, కార్యదర్శి నరేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు సెలవులు ప్రకటించగా, 9వ తేదీ సోమవారం నుంచి పత్తి కొనుగోళ్లు మొదలవుతాయనే విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	6,700	4,000
మిర్చి	16,200	6,500
మిర్చి తాలు	7,300	6,500
ఏసీ మిర్చి	16,575	7,000
ఏసీ తాలు	7,300	6,500
పత్తి	7,125	6,300

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.20,413

రైతులకు ఏ కష్టం రానివ్వం

- బీఆర్‌ఎస్‌తో విసుగెత్తడంతోనే మాకు పట్టం కట్టారు..
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జీళ్లచెరువులో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: దేశానికి అన్నం పెట్టే రైతులకు ఏ కష్టం రాకుండా తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూ సుమంచి మండలంలోని జీళ్లచెరువులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి ట్రాక్టర్ నడుపుతూ వచ్చిన మంత్రి మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ నిరంకుశ పాలనతో విసుగెత్తిపోయిన అన్ని వర్గాల ప్రజలు తమ పట్టం కట్టి ఏడాది పూర్తయిందన్నారు. సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్న ప్రభుత్వం తమదేనని తెలిపారు. సన్న ధాన్యం విక్రయించి బోనస్ పొందిన రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని, సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు కూడా విడుదల చేస్తామని వెల్లడించారు. వచ్చే నాలుగేళ్లలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇళ్ల కోసం ఎవరికీ రూపాయి ఇవ్వొద్దని సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నుపూసల సీతరాములు, నాయకులు స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి సీసీ రహదారులు

పాలేరు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో సీసీ రహదారులు నిర్మిస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి మండలంలోని గట్టుసింగారం, మల్లేపల్లి, నర్సింహులగూడెం తదితర గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు.

ఎట్టకేలకు తొలగించారు...



యాష్ ట్యాంకర్ ఢీకొనడంతో వంగిపోయిన ప్రమాదకరంగా మారిన విద్యుత్ టవర్‌ను విద్యుత్ అధికారులు తొలగించారు.

ఖమ్మం బైపాస్‌రోడ్డు సమీపాన టవర్‌ను యాష్ ట్యాంకర్ ఆదివారం ఢీకొట్టగా వంగిపోయి తీగలు వేలాడసాగాయి. సోమవారం సాయంత్రం వరకు ఎవరూ పట్టించుకోని అంశంపై మంగళవారం 'సాక్షి'లో 'ప్రమాదకరంగా విద్యుత్ టవర్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు పోలీసుల సాయంతో ట్యాంకర్‌ను పక్కన పెట్టించి టవర్ తొలగించడమే కాక లైన్లను సరిచేశారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సాక్షి ఎఫెక్ట్..

ఎస్‌ఐ వసూళ్లపై ఉన్నతాధికారుల ఆరా

చర్చనీయాంశంగా మారిన 'సాక్షి' కథనం

మధిర: మధిర సర్కిల్‌లోని ఓ ఎస్‌ఐ తీరుపై మంగళవారం సాక్షిలో 'వసూళ్లపైనే ప్రత్యేక దృష్టి' శీర్షికన ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. ఈమేరకు ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు పలువురి నుంచి సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. గతంలో అధికార పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ ద్వారా ఇసుక రవాణా కోసం ట్రాక్టర్‌కు రూ.15వేల చొప్పున వసూలు చేసిన సదరు ఎస్సై, ఉన్నతాధికారులు చీవాట్లు పెట్టడంతో తిరిగి ఇచ్చేసిన అంశాన్ని ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. మడుపల్లిలో పోక్సో కేసు నమోదులో జాప్యం, రాయపట్నం బ్రిక్స్ కంపెనీ వద్ద ఇసుక సీజ్ చేసి ఇంకొకరికి విక్రయించడం, లాడ్జిలో పేకాట ఆడుతున్న వారి నుంచి డబ్బు వసూళ్లపై సమాచారం సేకరించి నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది. అంతేకాక చోరీ అయిన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు గుర్తించి తిరిగి ఇచ్చే సమయాన సదరు ఎస్సై రూ.5వేల చొప్పున వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయని సమాచారం. కాగా, అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరిస్తుండగా, జిల్లా పోలీసు బాస్ సైతం సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచిస్తున్నప్పటికీ ఇక్కడి ఎస్సై వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది.

సదరం క్యాంపు వద్ద దివ్యాంగుల ఇక్కట్లు



నడవలేని స్థితిలో వేచి ఉన్న వ్యక్తి



నిల్చునే ఓపిక లేక కూర్చున్న వృద్ధుడు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతీ మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. అయితే క్యాంపునకు వచ్చే దివ్యాంగుల కోసం సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 10గంటలకు క్యాంప్ మొదలు కావాల్సి ఉండగా వైద్యులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక దూరప్రాంతాల దివ్యాంగులు 8గంటలకల్లా వచ్చి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కనీసం కూర్చునేందుకు కూడా కుర్చీలు, బల్లలు లేక తాగు నీరు సైతం సమకూర్చకపోవడంతో గంటల తరబడి అవస్థ ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రిలో మంగళవారం క్యాంప్ వద్ద పరిశీలించగా పలువురు దివ్యాంగులు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

నేడు జాతీయ సాధన సర్వే పరీక్ష

97 పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: పాఠశాల విద్యార్థుల్లో సామర్థ్యాలను గుర్తించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మూడేళ్లకోసారి జాతీయ సాధన సర్వే(న్యాస్) నిర్వహిస్తోంది. ఈ సర్వేలో భాగంగా జిల్లాలోని 97 పాఠశాలల్లో బుధవారం పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లుచేశారు. పరీక్షకు 5,434మంది విద్యార్థులు హాజరుకానున్నారు. కాగా, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 3, 6, 9వ తరగతుల విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తుండగా భాష, గణితం, పరిసరాల విజ్ఞానం, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష ఉదయం 10–30 గంటలకు మొదలై 3, 6వ తరగతులకు 90 నిమిషాలు, 9వ తరగతికి 120 నిమిషాల్లో పూర్తిచేస్తారు. పరీక్ష పరిశీలనకు సీబీఎస్ఈ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా 147 మంది డైట్, బీఈడీ విద్యార్థులు, అధ్యాపకులను కేటాయించారు. అలాగే, జిల్లాస్థాయి పర్యవేక్షకులుగా డీఈఓ సోమశేఖరశర్మ, గోర్కి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజన్ వ్యవహరిస్తారు. కాగా, సర్వేలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దామని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ వెల్లడించారు. పరీక్ష విధానం, ఓఎంఆర్ షీట్ పూర్తి చేయడంపై అవగాహన కల్పించామని తెలిపారు.

సెల్‌ఫోన్ల ఆధారంగానే దర్యాప్తు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో గత మంగళవారం రాత్రి వెంకటరమణ–కృష్ణకుమారి హత్యకు గురి కాగా, సెల్‌ఫోన్ల కాల్ డేటా ఆధారంగా పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. మృతుల రెండు ఫోన్లను వేర్వేరు సమయాన గుర్తు తెలియని వ్యక్తులు రహదారులపై పడేయగా హత్యలో స్థానికుల ప్రమేయం ఉందా అనే కోణంలో విచారణ నిర్వహిస్తున్నారు. ఓ రెస్టారెంట్ ఎదురుగా పడేసిన సెల్‌ఫోన్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లిన వ్యక్తిని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అసలు మృతులకు సంబంధించి ఫోన్లు స్థానికుల చేతికి ఎలా వచ్చాయి. హంతకులు కావాలనే ఫోన్లను వదిలేస్తే వీరికి దొరికాయా అన్నది తేలాల్సి ఉంది. లేదంటే హత్యలో స్థానికుల ప్రమేయం ఉండగా వారు పడేశారా అన్న కోణంలో కాల్‌డేటా ఆధారంగా విచారిస్తున్నట్లు సమాచారం.



ఆర్టీసీ డిపోల్లో ఉద్యోగుల వనభోజనాలు



ఖమ్మంలో ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న ఆర్‌ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచన మేరకు ఖమ్మం రీజియన్‌లోని డిపోల్లో ఉద్యోగులకు వనభోజనాలు ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం డిపోలోని ఉద్యోగులకు మంగళవారం వనభోజనాలతో పాటు ఉద్యోగులకు ఆటపాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం ఏ.సరిరామ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొంటున్న ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిపో పరిధిలో ఎంపిక చేసిన డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్ అధ్యక్షత వహించగా డిప్యూటీ ఆర్‌ఎం భవానీప్రసాద్, ఏఓ బాలస్వామి, పర్సనల్ ఆఫీసర్ జీ.ఎస్.నారాయణ, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి డిపోలో...

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో మంగళవారం వనభోజనాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించగా విజేతలకు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి బహుమతులు అందించారు. ఆర్టీసీ ఉద్యోగులతో పాటు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, సూపర్‌వైజర్లు బాలస్వామి, సుబ్బారావు, కాంతారావు, నాగరాజు, కిన్నెర ఆనంద్ పాల్గొన్నారు.



సత్తుపల్లిలో భోజనాలు వడ్డిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

మార్కెట్లను పరిశీలించిన ఏడీ



మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న ఏడీ

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ పురం రవికుమార్ మంగళవారం జిల్లాలోని ఖమ్మం, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్లను సందర్శించారు. సుమారు 24 ఎకరాల్లో రూ. 20 కోట్లతో మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం జరుగుతుండగా శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం మార్కెట్‌లో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశమై పంటల కొనుగోళ్లపై ఆరా తీశారు. ఎస్‌ఈ రంగు లక్ష్మణ్ గౌడ్, ఈఈ మారపల్లి బలేష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరనాథ్, మార్కెట్ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 42 మంది డీబార్

కేయూక్యాంపస్/ఖమ్మంసహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల మొదటి, ఐదో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం జరిగాయి. కాగా, వివిధ కేంద్రాల్లో కాపీ చేస్తూ పట్టుబడిన 42 మంది విద్యార్థులను స్క్వాడ్ బృందాలు డీబార్ చేశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆరుగురు, వరంగల్ జిల్లాలో ఒకరు, ఆదిలాబాద్‌లో 35 మంది డీబార్ అయ్యారని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

'ప్రజలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం'



సమావేశంలో మాట్లాడుతున్న గల్లా సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ విమర్శించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా పేరిట ఎకరాకు రూ.15వేలు జమ చేస్తామని ఏడాది పూర్తయినా అమలుచేయలేదని తెలిపారు. అంతేకాకుండా రైతు కూలీలకు భృతి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకపోగా రుణమాఫీ కూడా అసంపూర్తిగానే వదిలేశారని చెప్పారు. అలాగే, తెలంగాణ అమరవీరులు, మహిళలకు ఇచ్చిన హామీలను కూడా గాలిదొదిలేశారని ఆరోపించారు. ఈసమావేశంలో నాయకులు తాండ్ర వినోద్‌రావు, నంబూరి రామలింగేశ్వరావు, శ్యాంరాథోడ్, నున్నా రవి, అల్లిక అంజయ్య, సరస్వతి, వెంకటనారాయణ యాదవ్, చావా కిరణ్, నెల్లూరి కోటేశ్వరావు, మాధవ్, శ్రీనివాస్, లక్ష్మయ్య, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య..

మధిర: కుటుంబ కలహాల నేపథ్యాన ఒక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని నాగవరప్పాడుకు చెందిన తోక వేణు(25)కు ఇటీవలే వివాహం కుదిరింది. రెండు రోజుల క్రితం ఇంట్లో వివాదం జరగడంతో మనస్తాపానికి గురైన ఆయన ఈనెల 1న పొలంలో పురుగుల మందు తాగాడు. దీంతో విజయవాడకు తరలించగా చికిత్సపొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై కేసునమోదు చేసినట్లు మధిరరూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి తెలిపారు.

వ్యాపారి మృతిపై అనుమానముందని ఫిర్యాదు

ఖమ్మంక్రైం: ఖమ్మంకు చెందిన చిట్స్ వ్యాపారి చేకూరి సత్యంబాబు సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకోగా.. తనకు అనుమానాలు ఉన్నాయని ఆయన చిన్నకుమారుడు శేఖర్ మంగళవారం ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట తన తండ్రి గుండెపోటుతో మృతి చెందాడని సమాచారం ఇచ్చి, ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన అన్న శ్రీధర్ – ప్రవీణ, తల్లి నాగేంద్రమ్మతోపాటు వెంపటి వెంకటరమణ, మొగిలి శ్రీనివాస్‌రెడ్డిపై అనుమానం ఉందని, పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరాడు. కాగా, శేఖర్ ఫిర్యాదు తమకు అందిందని సీఐ బాలకృష్ణ తెలిపారు.

8న పోటు ప్రసాద్ సంస్మరణ సభ



మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల మృతి చెందిన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సంస్మరణ సభ ఈ నెల 8న ఉదయం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎస్‌ఆర్ కళాశాల కొనసాగుతున్న పాత మమత మెడికల్ కళాశాలలో 8న ఉదయం 10 గంటలకు మొదలయ్యే సంస్మరణసభలో సీపీఐ జాతీయ కార్యదర్శి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్, సీపీఐ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో నాయకులు బీజీ క్లెమెంట్, దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కొణిజర్ల: పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని బొట్లకుంట సమీపాన కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా నలుగురు పట్టుబడగా మరికొందరు పరారయ్యారని తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.16,500 నగదు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం టేకులపల్లికి చెందిన జోనబోయిన నాగభూషణం(45) ద్విచక్ర వాహనంపై కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. రోజుమాదిరిగానే మంగళవారం ఆయన వాహనంపై టేకులపల్లి వెళ్తుండగా ఖమ్మం నుంచి సత్తుపల్లి వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన నాగభూషణం అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, సుమారు 100 మీటర్ల మేర ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ లాక్కెళ్లి చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. డ్రైవర్ కొంపెల్లి రాకేష్ వాహనాన్ని అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని తెలియగా కల్లూరు ఎస్సై టి.నాగరాజు చేరుకుని ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

మృత్యుంజయుడు..

- వరికోత మిషన్‌లో పడిన రైతు
- తీవ్ర గాయాలతో బయటపడిన వైనం



మిషన్ కింద పడిపోయిన శ్రీనివాసరావు, చక్రాలు దిగడంతో వీపుపై, చేతికి అయిన గాయాలు

వరి కోసే యంత్రంలో ప్రమాదవశాత్తు పడిన రైతు తీవ్రగాయాలతో బయటపడ్డాడు. నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండాకు చెందిన గుగులోతు శ్రీనివాసరావు మంగళవారం తన పొలంలో వరి కోయిస్తున్నాడు. యంత్రం డబ్బాలో ధాన్యం నిండి కింద పడుతుండడంతో ఆయన సరిచేస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు శ్రీనివాసరావు చొక్కా యంత్రం బెల్ట్‌లో పడడంతో అందులో చిక్కుకున్నాడు. అక్కడే ఉన్న రైతులు కేకలు వేయగా డ్రైవర్ మిషన్ నిలిపివేశాడు. అప్పటికే రైతు ఒంటి నిండా మిషన్‌కు సంబంధించి పళ్లు గుచ్చుకోగా.. సమీపంలోని వారు యంత్రం విడిభాగాలు విప్పదీసి ఆయనను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. కాగా, మిషన్ ఆపడం క్షణం ఆలస్యమైనా ఆయన ప్రాణాలు దక్కేవి కావని అక్కడి రైతులు తెలిపారు. – నేలకొండపల్లి

బ్రిడ్జి పైనుంచి పడినా దక్కిన ప్రాణం

- నీళ్లలో పడడంతో తప్పినప్రాణాపాయం



వైరా నదిలో పడిపోయిన సాయిచరణ్

మధిర: రైలు బ్రిడ్జి పైనుంచి వెళ్తున్న క్రమాన తలుపు వద్ద కూర్చున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పైనుంచి పడినా గాయాలతో బయటపడ్డాడు. ఆయన పడిన చోట నీరు, ఇసుక ఉండడంతో ప్రాణాలు దక్కినట్లయింది. వివరాలు... ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆర్.సాయిచరణ్ తిరుపతి మంగళవారం నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. డోర్ వద్ద కూర్చున్న ఆయన మధిర సమీపాన వైరా నదిపై బ్రిడ్జి వద్ద జారిపడ్డాడు. అయితే, నదిలో నీరు ఉండడంతో ప్రమాదం తప్పింది. కాగా, తీవ్రంగా గాయపడిన ఆయన కేకలు విన్న ట్రాక్‌మెన్ గమనించి క్షతగాత్రుడిని 108లో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.